TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISH IN TELANGANA సంపుటి : 1 సంచిక: 10 3-6-2025 మంగళవారం పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

# రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే మా లక్ష్యం: సీఎం రేవంత్

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా.. పలువురు ప్రముఖుల శుభాకాంక్షలు




ఢిల్లీ,సందేశం టైమ్స్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ పురోగతికి లెక్కలేనంత కృషి చేసినందుకు ఈ రాష్ట్రం ప్రసిద్ధి చెందిందని అభివర్ణించారు. గత దశాబ్దంలో, రాష్ట్ర ప్రజల 'జీవన సౌలభ్యాన్ని' పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం చాలా చర్యలు చేపట్టిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు విజయం, శ్రేయస్సుతో ఆశీర్వదించాలని ప్రధాని మోదీ కోరారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

2 లో

## ఊరూరా తెలంగాణ అవతరణ వేడుకలు.. రాష్ట్ర పునర్నిర్మాణం ప్రభుత్వ ఎజెండా.. సీఎం రేవంత్



సందేశం టైమ్స్:

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు చక్కదిద్దే పనిలో ఉన్నాం**

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర గందరగోళంలో ఉందని, గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన అనేక కీలక వ్యవస్థలను ప్రస్తుతం చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యామని తెలిపారు. ఈరోజు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

**మహిళా సాధికారతే నిజమైన అభివృద్ధి**

రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్రకు కీలకమని పేర్కొన్న సీఎం, మహిళల ఆర్థిక, ఆరోగ్య, సామాజిక స్థితిని మెరుగుపరచే విధంగా అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. వారికి ఇప్పటికే రూ.21 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను అందించాం. పాఠశాలల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకే అప్పగించాం. రుణాలు ఇచ్చి బస్సులు కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు తీసుకుని మహిళా సంఘాలకు ఆదాయం కల్పిస్తున్నాం. త్వరలోనే క్యూఆర్ కోడ్ కార్డు ద్వారా మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించే పథకాన్ని కూడా తీసుకురాబోతున్నాం" అని రేవంత్ రెడ్డి వివరించారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

రైతుల భద్రత, సంక్షేమమే తమ ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేశారు. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తూ వారి విశ్వాసాన్ని చూరగొన్నామని చెప్పారు. "మేం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోపే రూ. 2 లక్షల లోపు రైతుల రుణాలను మాఫీ చేశాం. ఈ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.26 వేల కోట్లు జమ చేశాం. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నాం. దీని ఫలితంగా రాష్ట్రంలో సన్న వడ్ల సాగు గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.2.75 లక్షల టన్నుల సన్న ధాన్యం ఉత్పత్తి అవుతోంది. రైతుల భూములపై ఎలాంటి వివాదాలు లేకుండా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. అందుకోసమే 'భూభారతి' కార్యక్రమాన్ని తీసుకువస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

**యువత, విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టామని సీఎం చెప్పారు. దేశంలో ఉద్యోగ నియామకాల విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. సివిల్స్‌కు ఎంపికైన వారికి ప్రోత్సాహకంగా రూ.లక్ష అందిస్తున్నామని, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. "ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. ఇందుకోసం రూ.200 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టాం.

**వైద్య, ఆరోగ్య రంగాలలో విస్తృత మార్పులు**

వైద్య రంగాలను ప్రక్షాళన చేసిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచామని, ఉస్మానియా ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్టు తెలిపారు.

**కులగణనపై విప్లవాత్మక నిర్ణయం**

"తెలంగాణ ప్రభుత్వం వందేళ్లలో జరగని కులగణన చేపట్టింది. ఇది సామాజిక సమానత దిశగా ఒక చారిత్రక అడుగు," అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

2 లో

## దేశంలోనే సుసంపన్నరాష్ట్రంగా తెలంగాణ

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఉమ్మడి ఖమ్మం సందేశం టైమ్స్ : తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే సుసంపన్నంగా నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అలాగే జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కుల మతాలకతీతంగా విద్యార్థులకు విద్యను అందిస్తున్నామని చెప్పారు.

మిగతా 2లో...

## ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు



### అన్ని మండలాల్లో సదస్సులు : మంత్రి పొంగులేటి

2 లో

## అమరవీరులకు మంత్రి పొంగులేటి నివాళి



వరంగల్:సందేశం టైమ్స్: వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ మైదానంలో అంగరంగ వైభవంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నేడు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగలేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.. ముందుగా ఖిలా వరంగల్ మధ్య కోటలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన త్యాగధనులకు ఘనంగా నివాళులర్పించారు.

2 లో

## దేశానికి దిశానిర్దేశం చేస్తున్న తెలంగాణ : ఎన్ ప్రీతం

వనపర్తి, సందేశం టైమ్స్ : పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు సామాజిక న్యాయంలో సైతం తెలంగాణ దేశానికి దిశానిర్దేశం చేస్తుందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్ ప్రీతం అన్నారు. సోమవారం జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతం హాజరయ్యారు. ఆయనతో పాటు వేదికపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్,



వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, వనపర్తి మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ముందుగా కలెక్టర్, శాసనసభ్యులతో కలిసి తెలంగాణ అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్ఛంతో నివాళి అర్పించారు.

మిగతా 2లో...

## ఉద్యమ వీరులకు రూ.కోటి పురస్కారం .. స్వీకరించిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ

హైదరాబాద్ సందేశం టైమ్స్: తెలంగాణ ఉద్యమం లో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మందికి కోటి రూపాయల నగదు పురస్కారాన్ని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందచేశారు. తెలంగాణ ఉద్యమం లో ప్రజల గుండెల్లో నిలిచిన కవులు కళాకారులు సాహితీవేత్తలు తొమ్మిది మందికి కోటి రూపాయల నగదు పురస్కారం అందిస్తామని



తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ముఖ్యమంత్రి ప్రకటించారు. అప్పుడే పేర్లు ప్రకటించారు.వారందరికీ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పెరేడ్ గ్రౌండ్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి నగదు పురస్కారం అందించారు. ఎక్కా యాదగిరి రావు, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరి నేరుగా కోటి నగదు చెక్ ను అందుకున్నారు.

మిగతా 2లో...

## ఒంటరిగానే పోటీ చేస్తాం.. 100 సీట్లు సాధించి అధికారం చేపడతాం.. హరీశ్ రావు



2 లో

(మొదటి పేజీ తరువాయి)

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా..

## పలువురు ప్రముఖుల శుభాకాంక్షలు

**తెలంగాణ ప్రజలు అభివృద్ధి, శ్రేయస్సు మార్గంలో ముందుకు సాగాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. యువ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, ఆర్థిక , సాంకేతిక అభివృద్ధి శక్తివంతమైన ఆధునిక పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, శ్రేయస్సు మార్గంలో ముందుకు సాగాలని ద్రౌపది ముర్ము కోరారు.

**తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలి: సీఎం చంద్రబాబు**

తెలుగు రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే తన ఆలోచన, ఆకాంక్ష అని తెలిపారు. 12వ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని, అభివృద్ధి పథంలో సాగాలని కోరుకుంటున్నానని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడుతూ వికసిత్ భారత్-2047 నాటికి అగ్రస్థానానికి చేరుకోవాలని, తెలుగు జాతి తిరుగులేని శక్తిగా నిలవాలని.. ఇందులో ప్రతి తెలుగు పౌరుడు భాగస్వామి కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## దేశంలోనే సుసంపన్నరాష్ట్రంగా తెలంగాణ

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రెవెన్యూ శాఖ పటిష్టతకు చర్యలు

రెవెన్యూ శాఖను పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టామని, ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి పరిపాలన అధికారిని నియమిస్తున్నామని భట్టి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మన ఆడబిడ్డల ప్రయాణ ఖర్చులు ఆలోచించి వారి ప్రయాణ ఖర్చులు ఉచితం చేశామని గుర్తు చేశారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్న వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, నిరాశ్రయులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించిందన్నారు. రైతులకు రుణ మాఫీ చేసి రైతులు తిరిగి రుణ మాఫీ పొందడానికి మార్గం సుగమం చేశామన్నారు. ప్రస్తుత యాసంగికి బోనస్ చెల్లించనున్నామని చెప్పారు.

మద్దులపల్లిలో రూ.20 కోట్లతో మార్కెట్ యార్డ్

మద్దులపల్లిలో 20 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మార్కెట్ యార్డ్ నిర్మించుకుంటున్నామన్నారు. ఇందిరా మహిళ శక్తి కింద మహిళా మార్ట్, మహిళ క్యాంటీన్ లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వయం సహాయక సభ్యులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. గురుకులాల్లో చదివే విద్యార్థుల కు 40 శాతం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. వంద ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యం కలిగిన మెడికల్ కాలేజీలను రూ.130 కోట్లతో నిర్మించామన్నారు. రూ.20 కోట్ల నిధులతో రోడ్డు ప్రమాద ఘటనలో చికిత్స అందించేందుకు అత్యవసర విభాగాలు నిర్మించామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులతో పాటు మైనార్టీ విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

ఖమ్మం నగరం చుట్టూ రింగ్ రోడ్డు

ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారులు రానున్నాయి, రింగ్ రోడ్డుకు చర్యలు చేపట్టామని భట్టి చెప్పారు. మున్నేరు నది పై తీగల వంతెన నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీలలో వైకుంఠ ధామం నిర్మించామన్నారు. అక్రమంగా గనులు తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, 825 కేసులు నమోదు చేసి కోటి 36 లక్షల జరిమాన విధించడం జరిగిందని తెలిపారు. కొత్తగా కల్లూరు పట్టణాన్ని మున్సిపాలిటీ గా ఏర్పాటు చేశామన్నారు. సర్దార్ పటేల్ స్టేడియం లో 8 కోట్ల 50 లక్షలతో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు చేశామని, సీఎం కప్ పోటీలకు ఖమ్మం జిల్లా నుండి 382 మంది క్రీడాకారులు పాల్గొని 20 బంగారు పతకాలు, 12 వెండి, 15 కాంస్య పతకాలు సాధించారని అన్నారు. భూ తాపాన్ని తగ్గించడానికి ప్రభుత్వం వన మహోత్సవం ప్రారంభించిందని, 2024-25 సంవత్సరానికి గాను 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో ఇప్పటికే 34 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని చెప్పారు.

## ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో గత ప్రభుత్వం స్వార్థం కోసం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగపరచిన విధానాన్ని, జరిగిన తప్పులను సరిచేసి మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేసి భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకువెళు_న్నామని రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం రెవెన్యూ సదస్సులపై సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరిన విధంగా రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. జూన్ 3వ తేదీ నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టంలో భాగంగా మిగిలిన అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నీ రెవెన్యూ గ్రామాలకు తహశీల్దార్ తో కూడిన బృందం వెళు_ందన్నారు. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తుందన్నారు.

**ఆనాటి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో..**

ఆనాటి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు వారి ప్రమేయం లేకుండానే భూ సమస్యల్లో చిక్కుకున్నారని, సమస్యల గురించి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉండేదని మంత్రి అన్నారు. ఏ సమస్యకైనా కోర్టు మెట్లు ఎక్కవలసిందేనని, కానీ ఈనాడు ఈ ఇందిరమ్మ ప్రభుత్వం వారి వద్దకే వెళ్లి ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగానే వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఇప్పటికే ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు విజయవంతమయ్యాయని అన్నారు. మొదటగా నాలుగు పైలట్ మండలాల్లో 72 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన సదస్సుల్లో 13 వేలకు పైగా దరఖాస్తులు రెండో విడతలో 28 మండలలో 421 రెవెన్యూ గ్రామాలల్లో నిర్వహించిన సదస్సుల్లో 42 వేల దరఖాస్తులు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేసి ఇప్పటి వరకు 60 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించడం జరిగిందని అన్నారు. అధికంగా సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని, దీనికి త్వరలో పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

**ప్రభుత్వానికి, ప్రజలకు రెవెన్యూ శాఖ వారధి**

ప్రభుత్వానికి ప్రజలకు రెవెన్యూ శాఖ వారధిగా ఉంటుందని, ఈ విభాగం సమర్ధవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలు ఆకాంక్షలు నెరవేరి ప్రభుత్వం కోరుకున్న ఫలితాలు లభిస్తాయని పొంగులేటి అన్నారు. ప్రజలు కోరుకుంటున్న దిశలో రెవెన్యూ వ్యవస్ద పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలు గ్రామ స్థాయిలో అందించడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకు వెళ్తుందన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్ధాయిలో పర్యటించి భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ప్రజల వద్దకు వెళ్లే రెవెన్యూ యంత్రాంగం మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రజలతో మమేకం కావాలని, వీలైనంతవరకూ వారి సమస్య పరిష్కారం చేసేలా వ్యవహరించాలన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

# అమరవీరులకు మంత్రి పొంగులేటి నివాళి

అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల అధికారులు నిర్వహించిన పెరేడ్ లో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత ఆయన రాష్ట్ర అవతరణ దినోత్సవం, జిల్లా ప్రగతిని ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ స్వరాష్ట్ర పోరాటంలో అమరులైన వారి కుటుంబాలను సత్కరించారు, భాదాతప్త హృదయంతో అమర వీరుల కుటుంబ సభ్యులు వారిని గుర్తు చేసుకుని చలించి పోతే వారిని ఓదార్చి పరామర్శించి, ప్రభుత్వం వారికి అండగా ఉంటదని భరోసా ఇచ్చారు మంత్రి పొంగులేటి.వరంగల్ జిల్లా అధికారులు పట్టణ అభివృద్ధి, పథకాలపైన తయారు చేసిన శకటాలు, ఏర్పాటు చేసిన స్టాల్స్ లను సందర్శించారు.. ఇదే సమయలో వేదిక దగ్గర రైతులకు విత్తనాలను అందించారు, తెలంగాణ సంస్కృతి, దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించి వారిని అభినందించారు..ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి , శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య , పాల్ రెడ్డి , శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి , కె ఆర్ నాగరాజ్ , జిల్లా కలెక్టరు, పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,అన్ని శాఖల జిల్లా అధికారులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి దిశానిర్దేశం చేస్తున్న తెలంగాణ : ఎన్ ప్రీతం

అనంతరం పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా యంత్రాంగం తరుపున ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రజలకు శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం జయ జయహే తెలంగాణ గీతాలాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ%'ౌ% జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు సామాజిక న్యాయంలో సైతం తెలంగాణ దేశానికి దిశా నిర్దేశం చేస్తుందని తెలిపారు. రాష్ట్రం ఆవిర్భవించి నేటితో 11 ఏళ్ళు నిండాయని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం, గృహాలకు ఉచితంగా విద్యుత్తును అందించే గృహజ్యోతి కల్పించినట్లు తెలిపారు. భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి రాష్ట్రంలో భూసమస్యలను గుర్తించి సత్వర పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై ఆవిష్కరించడంలో విజయం సాధించామని, అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్, దావోస్, జపాన్ దేశాల్లో పర్యటించి భారీగా ప్రభుత్వం పెట్టబడులను సాధించిందన్నారు. హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సదస్సు, ప్రపంచ సుందరీమణుల పోటీలను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఈసందర్భంగా ముఖ్య అతిథి ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులకు, తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన వారి కుటుంబ సభ్యులను సత్కరించి గౌరవించారు.

అలరించిన చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయా పాఠశాలలకు చెందిన చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఐడిఓసి ఆవరణలో పోలీస్ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వైద్యశాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, పురపాలక, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్ ప్రీతం, కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించి తిలకించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఇతరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ సీత రాములు, జిల్లా వైద్య రోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, నాయకులు రాజేంద్ర ప్రసాద్, శంకర్ నాయక్, చీర్ల జనార్దన్, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ వీరులకు రూ.కోటి పురస్కారం .. స్వీకరించిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ



దివంగత గూడ అంజయ్య, గద్దర్ కుటుంబ సభ్యులు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ప్రజాకవి గోరటి వెంకన్న కార్యక్రమానికి హాజుర కాలేదు. కానీ ఆయన కుమార్తె ఆయన తరపున చెక్ అందుకున్నారు.ఇది ఇలా ఉంటే గోరటి వెంకన్న ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్నారు. పురస్కారం ప్రకటించినప్పుడు కేసీఆర్ అనుమతితో తీసుకుంటానని చెప్పారు. రూ.కోటి తీసుకోవద్దని చెప్పలేకపోయారు. ఆయననేరుగా తీసుకోకపోయినా కుమార్తెను పంపించారు. మరోవైపు తాను అవార్డును తిరస్కరించానని గతంలో నందిని సిధారెడ్డి చెప్పుకున్నారు. బీఆర్ఎస్ నేతలు అభినందించి వచ్చారు. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మాత్రం తిరస్కరించలేదు.

## ఒంటరిగానే పోటీ చేస్తాం..

### 100 సీట్లు సాధించి అధికారం చేపడతాం.. హరీశ్ రావు

హైదరాబాద్: బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ వస్తున్న వార్తలను బిఆర్ఎస్ పార్టీ సీనియర్ లీడర్ , మాజీ మంత్రి హరీశ్ రావు ఖండించారు. “కొందరు పనిగట్టుకుని బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో కలుస్తుందని ప్రచారం చేస్తున్నారు. మా పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోదు. ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి వస్తుంది. ఈ విషయంపై కేసీఆర్ ఇప్పటికే కుండబద్దలు కొట్టి చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీకి 100 సీట్లు రావడం ఖాయం” అని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. “రేవంత్ రెడ్డి ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? ఒక్క చెరువు అయినా తవ్వారా? రైతుబంధు, రైతుబీమా పథకాలను ఎగ్గొట్టారు. రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయకుండా కొంతే చేశారు” అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పడంలో అగ్రగామిగా నిలిస్తే, అభివృద్ధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అగ్రస్థానంలో ఉన్నారని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు సీఎం చేసిన వ్యాఖ్యలను నిరూపిస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. “అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి అయినా సరే గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా సహించబోం” అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంలో కొందరు అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని, వారి పేర్లను రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నామని, సమయం వచ్చినప్పుడు వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన అందాల పోటీల నిర్వహణ సరిగా లేదని, దీనివల్ల రాష్ట్ర పరువు పోయిందని హరీశ్ రావు ఆరోపించారు. “అందాల పోటీలు నిర్వహించడం కూడా చేతకాక రాష్ట్ర ప్రతిష్ఠను మసకబార్చారు. మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సీసీ ఫుటేజీని బయటపెట్టాలి” అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సంగారెడ్డి ప్రతినిధి ( జూన్ 2): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా విశదపరిచారు.

ఈ వేడుకల్లో కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ పంకజ్ , నారాయణఖేడ్ శాసన సభ్యులు సంజీవ్ రెడ్డి, ఎమ్ ఎల్ సి అంజిరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంజయ్య, అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్ , వివిధ శాఖల అధికారులు, పుర ప్రముఖులు పుర ప్రజలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు.

వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, అటవీ, పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య, జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమం, నీటి పారుదల, ఫిషరీస్, వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ గారితో కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

## మాజీ శాసన సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశానుసారం



సందేశం టైమ్స్ : అనంతగిరి,జూన్ 2 : అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలో కోదాడ మాజీ శాసన సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశానుసారం భారత రాష్ట్ర సమితి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వాయిల సింగవరం గ్రామ శాఖ అధ్యక్షులు కంటూ శ్రీకాంత్ .మాట్లాడుతూ పోరాటాల గడ్డపై ఉద్భవించిన వీర పుత్రుడు, స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటాలు చేసి ఉద్యమ నాయకుడు, మన తెలంగాణ బాపు కల్వకుంట్ల చంద్రశేఖర రావు జనం మెచ్చిన జననేత తెలంగాణ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర అమరవీరులను, తెలంగాణ ఉద్యమకారులను స్మరించుకుంటు వారిని నివాళులు అర్పిస్తూ ఎన్నోరంగాలలో తెలంగాణ ఉద్యమ సారధి తెలంగాణ జాతిపిత కెసిఆర్ అభివృద్ధి బాటలో నిలిపారు. తెలంగాణ లో 24గంటల కరెంట్,మిషన్ కాకతీయ,మిసన్ భగీరథ, రైతుబంధు,రైతుభరోసా, కళ్యాణలక్ష్మీ,షాదీముబారక్ వంటి అనేక కష్టతరమైన సంక్షేమ పథకాలు అమలు పరచి ప్రతి కుటుంబంలో సంక్షేమ ఫలాలు అందించిన బాపు కెసిఆర్ కు రుణపడి ఉంటాము అని అన్నారు, ఈ కార్యక్రమంలో కంటూ శ్రీకాంత్. బుర్ర బాబు. మేళ్లచెరువు గురవయ్య. బొర్రా యశ్వంత్. గొడుగు వీర గోపి. గరిడేపల్లి రామారావు. బొడ్డుపల్లి ప్రవీణ్. జంగిలి ఉపేందర్. బొడ్డుపల్లి రవి. కంటూ శ్రీను. కాకాని వెంకటేశ్వర్లు. చింత రాములు. సీతారాములు. తదితరులు పాల్గొన్నారు....

# వేతనాల్లేని పారిశుధ్య కార్మికులు

రాజమహేంద్రవరం సందేశం టైమ్స్: జిల్లాలోని పంచాయతీల పరిధిలో చెత్త సేకరించే గ్రీన్ అంబాసిడర్స్ (పారిశుధ్య కార్మికులు) పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలోని అత్యధిక పంచాయతీలలో మూడు నెలలకుపైగా గౌరవ వేతనాలు అందడం లేదు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు సతమతం అవుతున్నారు. కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలులో భాగంగా ఐదేళ్ల కిందట పంచాయతీల పరిధిలో 250 కుటుంబాలకు ఒకరు చొప్పున గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. ప్రారంభంలో జిల్లాకు సంబంధించి సుమారు 900 మందికి పైగా నియామకం చేశారు. సకాలంలో వేతనాలు అందక పోవడంతో వీరి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం సుమారు 760 మంది మాత్రమే పని చేస్తున్నట్లు అంచనా. నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ వేతనంగా తొలుత వీరికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి వేతనాలు చెల్లించే వారు. కొన్నాళ్ల పాటు మంజూరైన తర్వాత కార్పొరేషన్ నుంచి చెల్లింపులు నిలిచాయి. ఆ తర్వాత పంచాయతీల పరిధిలోని 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు జనరల్ నిధుల నుంచి వారికి వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో 365 పంచాయతీలకు గాను 280 పంచాయతీల వార్షిక ఆదాయం తక్కువగా ఉండడంతో వారిపై దృష్టి సారించడం లేదు. సాధారణ, ఆర్థిక వనరులు మెరుగ్గా ఉన్న పంచాయతీల్లో నిధులను బట్టి మాత్రమే గ్రీన్ అంబాసిడర్లకు చెల్లింపులు చేస్తున్నారు. చెత్త సేకరణే ధ్యేయంగా బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం



పట్టించుకోకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీ నిధుల మళ్లింపుతో వారికి కష్టాలు తప్పడం లేదు. పంచాయతీల పరిధిలో ఆదాయ వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో సకాలంలో జీతాలు అందడం లేదు. నిత్యం పారిశుధ్య పనుల్లో నిమగమయ్యే తమకు సకాలంలో వేతనాలు చెల్లించకపోతే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇచ్చే అరకొర జీతం సక్రమంగా చెల్లించుకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు లేకుండా జీవనం సాగించడం ఎలానో అధికారులే చెప్పాలని వాపోతున్నారు. తడి, పొడి చెత్త సేకరణకు ఉపయోగించే రిక్షాల మరమ్మతులను సైతం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి సేకరణ పనిలో ఉండడంతో వేరే పనులకు వెళ్లలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణకు పవన్ కళ్యాణ్ సలాం

## జనసేనకు జన్మనిచ్చిన నేల
## ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల



అమరావతి,సందేశం టైమ్స్: " జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల, నాకు పునర్జన్మను ఇచ్చిన నేల, నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల, నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ. మూడున్నర కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు, దశాబ్దాల పోరాటాలకు ప్రతిరూపంగా, విద్యార్థులు, యువత బలిదానాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని రంగాలలో సంక్షేమాభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను".అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. తెలంగాణపై తనకున్న ప్రేమను పవన్ కళ్యాణ్ మరోసారి చాటుకున్నారు. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తనదైన శైలిలో తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇప్పుడు ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

# ఆరుద్ర పురుగులొచ్చాయ్



సందేశం టైమ్స్: ఎర్రావారిపాలె మండలంలో దుక్కి చేసిన పొల్లాలోకి ఆరుద్ర పురుగులొచ్చాయ్. అంటే.. ఖరీఫ్ పంటసాగుకు అదును ప్రారంభమైందని ప్రకృతి సూచనగా రైతులు భావిస్తారు. ఏటా జూన్ నెల ప్రారంభం కాగానే ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తాయి. ఆరుద్ర కార్తె ప్రారంభానికి ఈ పురుగులు పొలాల్లో కనపడటం వల్ల ఆరుద్ర పురుగులుగా పిలుస్తారు. ఎర్రగా మెరుస్తూ, పొలాల్లో చకచకా నడుసస్తూ, ముట్టుకొంటే మృదువుగా ఉండే ఈ పురుగులు రైతులకు కనువిందు చేస్తాయి. పొల్లాలో ఆరుద్ర పురుగులు కనపడడం శుభసూచకంగా రైతులు భావిస్తారు. వర్షాలు భాగా కురస్తాయని వీరి నమ్మకం.

# పట్టణంలో తీవ్ర తాగునీటి సమస్య




సందేశం టైమ్స్: గొల్లప్రోలు పట్టణంలో మూడు రోజులుగా ప్రజలు తాగునీటి సమస్యలను ఎదుర్కొంటు న్నారు. కనీసం ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారానైనా తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్ఎ పవన్ కల్యాణ్ తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.70 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో పంప్ హౌస్‌ను సైతం నిర్మించారు. ఆ హౌస్‌ను ఎంఎల్‌సి నాగబాబు ఇటీవల ప్రారంభించారు. అయినా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రోజుల తరబడి తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతోంది. ఏలేరు కాలువ వద్ద ఏర్పాటుచేసిన పంప్ హౌస్ ప్రాంతంలో మురుగు నీరు ఉండడం, విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గొల్లప్రోలు పట్టణ పరిధిలో 20 వార్డులకు 11 లైన్ల ద్వారా వంతులు వారిగా మంచినీటి సరఫరా చేస్తున్నారు. పట్టణ పరిధిలో కుళాయిలు లేని సూరంపేట జగన్ కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా 12 రోజులకు ఒకసారి చేస్తున్నారని, అలాగే దేవీనగరం, శివాలయం ఏరియాకు 3 రోజుల నుంచి తాగు నీరు సరఫరా లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోటార్లకు మరమ్మతులు సమస్య వస్తున్నా అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉద్యోగుల బదిలీలపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




అమరావతి:సందేశం టైమ్స్: ఏపీ ఉద్యోగుల బదిలీలపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల సాధారణ బదిలీల గడువు జూన్ 9వ తేదీ వరకు పొడిగించింది. ఉద్యోగుల బదిలీలపై మే15వ తేదీన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. మే 16వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఏపీలో ఉద్యోగుల బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఆయా శాఖల బదిలీల్లో అర్హతలపై ఇప్పటికే మార్గదర్శకాలను ఏపీ ప్రభుత్వం జారీ చేసిన విషయం తెలిసిందే. మరో ఏడు రోజుల పాటు బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. బదిలీల గడువును పెంచాలని ప్రభుత్వానికి ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలు విన్నవించారు.

# జమ్మూకు ఒక న్యాయం... విశాఖకు మరో న్యాయమా

### వైజాగ్ రైల్వేజోన్ ఎందుకివ్వరు?
### దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు శంకర్రావు




విజయవాడ,సందేశం టైమ్స్ : జమ్మూ రైల్వే డివిజన్ ఏర్పాటుకు డీపీఆర్ రెడీ కావటంతో పాటు ఏకంగా పరిపాలనను ప్రారంభిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం...విశాఖ రైల్వేజోన్ విషయంలో ఎందుకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేకపోతోందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శంకర్రావు ప్రశ్నించారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో రీ–ఆర్గనైజేషన్ యాక్ట్‌లో ఏపీకి ప్రత్యేక రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలపై రిపోర్టు ఇవ్వటానికి పార్లమెంట్‌లో ఆమోదం లభించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత డీపీఆర్ కూడా ఆమోదం పొందిందని, ఇప్పటికి పదేళ్లు గడిచినా జోన్ ఏర్పాటు కాలేదన్నారు. 2025–జనవరిలో ప్రకటించిన జమ్మూ రైల్వే డివిజన్‌కు 6 నెలల్లోపే డీపీఆర్ తయారు చేయించారని, వెంటనే ఆమోదం కూడా పొందిందన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వటంతో పాటు జూన్ 1 నుంచి పరిపాలన కూడా ప్రారంభమైందన్నారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌పై ఎందుకు కేంద్ర ప్రభుత్వం సవతిప్రేమ చూపిస్తోందని ప్రశ్నించారు. భూమి ఇవ్వలేదన్న పేరుతో కొన్నేళ్లుగా కాలయాపన చేశారని, . చంద్రబాబు అధికారంలోకి రాగానే భూములను అప్పగించి కొత్త భవనాల శంకుస్థాపనకు చర్యలు చేపట్టార ని, కేంద్రం ఎందుకు జీవో ఇవ్వట్లేదని నిలదీశారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు విశాఖ రైల్వేజోన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రధానితో మాట్లాడి కేంద్ర ప్రభుత్వం ద్వారా జీవో ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అమెరికాలో మెరిసిన కృష్ణా ఆడపడుచు

### మిసెస్ తెలుగు యూఎసఏ విజేతగా అట్లూరి మౌనిక
### స్వగ్రామం పామర్రు మండలం ఐనంపూడి



గుడివాడ, సందేశం టైమ్స్ : అమెరికాలో జరిగిన మిసెస్ తెలుగు యూఎసఏ విజేతగా గుడివాడకు చెందిన అట్లూరి మౌనిక నిలిచారు. మే 26న జరిగిన మిస్ అండ్ మిసెస్ తెలుగు యూఎసఏ పోటీల్లో పాల్గొన్న 25 మందిలో మౌనిక ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మౌనికకు గత విజేత శ్రేయ బొప్పన కీరిటాన్ని అలంకరించారు. మౌనిక బీఈ సివిల్ ఇంజనీరింగ్ చేసి, హైదరాబాదులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో వివాహం అనంతరం అమెరికా వెళ్లిపోయారు. ప్రస్తుతం అమెరికాలోని సేల్స్‌ఫోర్స్‌లో శాశ్వత ఉద్యోగిగా ఉన్నారు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. మౌనిక తండ్రిదండ్రులు అట్లూరి కృష్ణప్రసాద్, శైలజ. వీరి స్వగ్రామం పామర్రు మండలం ఐనంపూడి కాగా, ప్రస్తుతం గుడివాడలో నివాసముంటున్నారు.

# గంజాయి రవాణా నిర్మూలనకు చర్యలు



రామభద్రపురం, సందేశం టైమ్స్ : ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి రవాణా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి డీఎస్పీ భవ్యా రెడ్డి తెలిపారు. మండలంలోని ఎనుబరువు వద్ద 6లైన్‌రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఒడిశా నుంచి ఎక్కువగా గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచా రం అందడంతో ఈ రోడ్డులో మరో కొత్త చెక్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పాచిపెంట మండలంలోని మాతుమూరు వద్దగాని, హెచ్‌జీ ఇన్‌ఫ్రా స్టెక్టర్ ఆఫీసు వద్దగాని చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రామభద్రపు రం మండలంలోని కొట్టక్కి వద్ద ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, దీంతో ఇటీవల గంజాయి అక్ర మ రవాణాను నిరోధించామని చెప్పారు. కార్యక్ర మంలో బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భోగాపురం, సందేశం టైమ్స్ : మండలంలోని రాజాపులోవ జాతీయ రహదారిపై ప్రమాదానికి గురై ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న విశాఖ జిల్లా భీమిలి మండ లంలోని టి.నగరపాలెంకు చెందిన యువకుడు గడ దాసరి సాయి (27) మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నగరపాలెంకు చెంది న సాయి ద్విచక్ర వాహనంపై నగర పాలెం నుంచి విజయనగరం వెళ్లాడు. అక్కడ పనులు ముగిం చుకుని మరలా అదేరోజు రాత్రి బయలుదేరాడు. రాజాపులోవ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తె లుసుకున్న కుటుంబ సభ్యులు విశాఖలోని కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికి త్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు, ఇద్దరు సోదరు లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

# మా అమ్మ ఊగుతోంది..

- ♦ బిడ్డల కళ్లముందే ఉరేసుకున్న తల్లి
- ♦ బయటకు వచ్చి చెప్పిన చిన్నారులు
- ♦ చిన్న సంసారంలో చిచ్చుపెట్టిన ఆన్‌లైన్ బెట్టింగ్, తాగుడు వ్యసనం
- ♦ భార్యాభర్తల ఘర్షణ...క్షణికావేశంలో భార్య ఆత్మహత్య
- ♦ అనంతపురం జిల్లా యాడికిలో ఘటన



యాడికి, సందేశం టైమ్స్ : ఎదురుగా ముద్దులొలికే కన్నబిడ్డలు ఇద్దరూ ఆడుకుంటున్నారు...అయితే, ఆ తల్లికి ఎంత కష్టమొచ్చిందో ఏమో...పిల్లలు ఏమైపోతారో అని కూడా ఆలోచించకుండా వారి కళ్లముందే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఏం చేస్తోందో తెలియని పిల్లలు 'మా అమ్మ ఇంట్లో ఊగుతోంది' అని బయటకు వచ్చి చెప్పడంతో చుట్టుపక్కల వారు వచ్చిచూసినా ఫలితం లేకపోయింది. ఆమె అనంతలోకాలకు వెళ్లిపోయింది. అనంతపురం జిల్లా యాడికిలోని చౌడేశ్వరికాలనీలో పామిశెట్టి తిరుపతయ్య, ధనలక్ష్మి (26) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు శ్రీహాస్ (6), కుమార్తె లాస్య (4) ఉన్నారు. తిరుపతయ్య కూలి మగ్గం నేసే పని, ధనలక్ష్మి పట్టుచీరల దుకాణంలో కూలి పని చేస్తుంటారు. ఈ చిన్న సంసారంలో వ్యసనం చిచ్చుపెట్టింది. తిరుపతయ్య ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ విషయమై ఉదయం భార్యాభర్తలు గొడవపడ్డారు. అనంతరం తిరుపతయ్య బయటకు వెళ్లిపోయాడు. క్షణికావేశానికి లోనైన ధనలక్ష్మి పిల్లల ఎదుటే ఇంట్లో ఉరేసుకుంది. ధనలక్ష్మి ఉరేసుకుని, విలవిల్లాడుతున్నా అభంశుభం తెలియని బిడ్డలు అక్కడే ఆడుకుటుండడం గమనార్హం. 'మా అమ్మ ఇంట్లో ఊగుతోంద'ని చిన్నారులు చెప్పడంతో స్థానికులు చూసి కిందికి దింపి, యాడికి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# అర్ధరాత్రి కారు వీరంగం

### పేదల ఇంటిపై దూకి బీభత్సం
### క్షతగాత్రులను పరామర్శించిన సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు



విజయనగరం సందేశం టైమ్స్: విజయనగరం సన్ స్కూల్ ప్రక్కన గల రామక్రిష్ణ నగర్ లో అర్ధరాత్రి 12 గంటలకు కారు బీభత్సం సృష్టించింది. రామకృష్ణ నగర్ లో పేదలు ఇళ్లలో నిద్ర పోతున్న వేల పట్నాన సత్యవతి ఇంటి పైకి కారు డంపింగ్ యార్డు మీదుగా 15 అడుగుల ఎత్తు నుండి దూసుకొని వచ్చిది. కారు కింద ఇద్దరు పిల్లలు, గొడ్డు వినయ్ (14), పట్నాన మహీంద్రా (12) మరియు పట్నాన సత్యవతి (60) కూరుకుపోయారు. పిల్లలకి తీవ్రంగా దెబ్బలు తగిలి సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ సమయంలో కాలనీ యువకులు అందుబాటులో ఉన్నారు. వారు కారును ఎత్తి కారు కింద ఉన్న పిల్లల్ని రక్షించారు. లేకపోతే పిల్లలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడేదని స్థానికులు తెలిపారు. మహీంద్రాకి కాలు పైన రెండు చోట్ల కుట్లు వేశారు. ఆపరేషన్ చెయ్యాలని వైద్యులు తెలిపారు. తలపై తీవ్ర గాయమైది. వినయ్ కి చెయ్యి విరిగింది. ప్రస్తుతం వీరు ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఎం. శాంతమూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల్ని, కుటుంబ సభ్యులను ఓదార్చరు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగి అర్ధరాత్రి కారు నడుపుతున్న వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తక్షణమే లైసెన్సు రద్దు చేసి, కారు సీజ్ చేసి పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. పిల్లలను కాపాడిన యువకులను అభినందించారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006